వాళ్ళమధ్య వంతెన

ఈ సంవత్సరమైనా వెన్నెల్నీ, మల్లెపూలనూ వ్యర్థ పోనివ్వగూడదను కున్నాడు అనంతమూర్తి. ఇరవై ఎనిమిదో పుట్టినరోజు జరుపుకున్న రాత్రి ఒంటరిగా గదిలో కిటికీముందు కూర్చుని, జీవితాన్ని తనచుట్టూ పరచుకుని గట్టిగా ఆ మాటే అనుకున్నాడు కాని—

ఆ ఏడాదికూడా వర్షకాలం ప్రవేశించింది. వేసవిలో విరగపూసిన మల్లెపూలు క్రమంగా ఆఖరైపోయాయి. ఆ పూలచుట్టూ తిరిగి గుసగుసలు చెప్పి, పులకరింతలు పెట్టి, మైకంలోకి పడదోసి దొంగచాటుగా వాటి సువాసనల సంపదను దోచుకున్న గాలులు అతని తలమీంచి, అందరాని దూరంలోంచి కదిలి వెళ్ళిపోయాయి. వర్షంలా కురిసిన వెన్నెల అతని జీవిత క్షేత్రంమీద పడలేదు. ఎక్కడో ఏ అదృష్టపు కొండలమీదనో కురిసి, ఆ కురిసిన వర్షపు నీరంతా కలిసి పరవళ్ళుతొక్కే ఏరై, అతని జీవితానికి అల్లంత దూరంగా ప్రవహించి కదిలి, ఎవరి అనుభవాల సముద్రంలోనో లీనమైపోయింది.

నాలుగేళ్ళుగా యిలానే జరుగుతోంది. తన కోరిక ఎప్పటికి తీరేనో అన్న భయంకూడా యిప్పుడిప్పుడు కలుగుతోంది అతనికి. అది అతని దోషమే అని బంధువులూ, మిత్రులూ అంటున్నారు. ఇలా అయితే యిక పెళ్ళయినట్టే అని ఎగతాళికూడా చేస్తున్నారు.

ఏం చేస్తాడు మరి? చిన్నప్పటినుంచీ అతని అభిరుచులు అలానే రూపు దిద్దుకున్నాయి. సముద్రపు అంచున వున్న "ఉప్పాడ"లో అతను పుట్టాడు. ఊహ తెలిసినప్పటినుంచీ అతను సముద్రాన్ని చూస్తూనే వున్నాడు. సముద్రపు అలల మీద విరిగిన సూర్యచంద్రుల్నీ, కెరటాల మీద ఊగిసలాడి కదిలి నర్తించే పడవలనూ ప్రతిరోజూ అతను చూస్తూనే వచ్చాడు. ఉదయం నిద్ర

లేచి, ఆవలించి వరండాలోకి వచ్చేసరికి దూరంగా తామర మొగ్గలా సముద్రాన్ని చీల్చుకొచ్చిన బాలసూర్యుడు కెరటాల పొత్తిళ్ళలో ఊయలలూగుతూ కనిపించేవాడు. సాయంకాలం యిసుకలో ఆడుకోడానికి సముద్రపు వొడ్డుకు వెళ్తే ఏ ఆకతాయో తుంచి పారేసిన తామరపూవులా కెరటాలమీద తేలుతూ ఎగిరి పడుతూ ఆ సూర్యుడే కనిపించేవాడు. అప్పుడప్పుడు మనసు పుట్టిన రాత్రిళ్ళు చంద్రుడుకూడా ఉల్లిపొర కాగితంకన్నా సన్నని వెన్నెల తెరలోంచి దిగొచ్చి, అక్కడ కెరటాలమీద నృత్యంచేసి; తెల్లారిపోతుండగా, చెదిరి కింద పడి పోయిన వెలుగు ముత్యాల్నయినా ఏరుకోకుండా పారిపోయేవాడు. ఎప్పుడు చూసినా వయ్యారంగా వంగి, చివాల్న పైకెగిరి, దబ్బున జారిపడి, కాస్సేపు అటూ యిటూ ఊగిసలాడుతూ కనిపించేవి పడవలు.

బాల్యమంతా అక్కడే గడిచింది. రోజూ కనిపించే ఆ దృశ్యాలే అతని మెదడుకు మేత అయ్యాయి. తర్వాత కాకినాడ వచ్చేశారు. వాళ్ళ వీధిలో డాక్టరుగారు ఒకాయన నెమిలిని పెంచుతుండేవాడు. వాళ్ళ బావమర్ది ఫారెస్టు రేంజరు. గొప్పిలి అడవుల్లో దాన్ని పట్టుకొచ్చి డాక్టరుగారికి యిచ్చాడట. ఆ నెమలి రోజూ యిళ్ళ కప్పులమీద ఆడుకుంటుండేది. అది కదిలినప్పుడల్లా సన్నగా, పొడుగ్గా వున్న దాని మెడ అటూ యిటూ ఊయలలూగేది. చంచలమైన దాని చూపులతోపాటు మెడకూడా మాటిమాటికీ కదిలేది. కుచ్చిళ్ళు విచ్చుకుని, రంగులు పరచుకుని పొడుగ్గా, బరువుగా కిందకు జారిన దానితోక విలాసంగా అటూ యిటూ కదిలేది. దాని నడకలో లయ వుంది; లాస్యం వుంది; అందం వుంది. అవన్నీ కలిసిన దాని నడక అతన్ని ఆకర్షించి ఆకట్టుకొనేది. అదొస్తే చదువుకూడా మానేసి దాన్నే చూస్తూ కూర్చునేవాడు. ఆ దృశ్యం కొంతకాలంపాటే వుండినా అది అతని మనసులో ముద్ర వేసుకుని నిలిచిపోయింది.

ఆ తర్వాత ఆనర్సు చదివే రోజుల్లో ఆంధ్రా యూనివర్సిటీ పిఠాపురం హాస్టల్లో వుండేవాడు. సముద్రపు వొడ్డున అర ఫర్లాంగు దూరంలో మూడేళ్ళు గడిపాడు.

ఇవన్నీ అతనికి తెలియకుండానే అతని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. యౌవ్వనారంభవేళ ఆలోచనల తలుపుల్ని తెరుచుకుని మనోహరమైన లోకం లోకి తొంగిచూసిన తొలిసారి అతనికి అక్కడ సప్తవర్ణాల కాంతులమధ్య కనిపించినది సముద్ర కెరటాలూ కాదు, సూర్యచంద్రులూ కాదు; ఊయల లూగే పడవలూ, ఆడుకునే నెమలీ కావు. అక్కడ—సూర్యచంద్రుల్ని వజ్రాల హారంలో బిగించి, సముద్ర కెరటాల్ని పాయలు పాయలుగా కుచ్చిళ్ళలో నింపి, ఎగిరిపడే పడవల కదలికల్ని పాదాలలోకి దించి, నెమలి రంగుల్ని వొంటినిండా కప్పుకుని దాని నడకలోని లయనూ, సోయగాన్నీ, అభినయాన్నీ అందుకుని అతి మనోహరమైన భంగిమలో ఒక నర్తకి కనిపించింది.

ఆ తర్వాత అతనికి చాలా అభిరుచులు ఏర్పడ్డాయి.

కృష్ణుడంటే అతనికి యిష్టం. కారణం—ఏ బొమ్మలో చూసినా కృష్ణుడి చుట్టూ నాట్యం చేస్తూ గోపికలు కనిపిస్తారు కనుక.

దేవాలయాలంటే యిష్టం—ప్రతి దేవాలయం మీదా అసంఖ్యాకంగా నర్తకిలు రాళ్ళల్లో దాగివున్నారు కనుక

లేడి అంటే యిష్టం—దాని చూపులు కూడా నర్తకి చూపుల్లా చంచలమై, సోయగమై, ఆకర్షణీయమైనవి కనుక.

అలాగే నర్తకి వేసుకుంటుంది గనుక పొడుగైన ఒంటిజడ అంటే యిష్టం. బుట్టలోలకులంటే యిష్టం. గోరింటాకు పెట్టుకోవడమంటే యిష్టం.

అతనికి యిరవై మూడో యేట తొలిసారి ఓ సంబంధం వచ్చింది. అతని బంధువులూ, మిత్రులూ చూసి చాలా చక్కటి సంబంధం అని మురిసి పోయారు. అతను మాత్రం కచ్చితంగా "నేను చేసుకోను" అన్నాడు. అందుకు అతను చెప్పిన కారణం—ఆ అమ్మాయికి నాట్యం రాదట అని. ఆ వార్త అలా అలా పాకిపోయి బంధువులందర్నీ చుట్టుముట్టింది. "అతగాడికి ఆటగత్తె కావాలట. అతని గురించని యిప్పుడు గెంతడం నేర్చుతామా. చేసుకోకపోతే మానె," అని నోళ్ళు నొక్కుకున్నారు బంధువులు. అతన్ని చూసి చాటు మాటుగా నవ్వుకునేవారు కూడాను.

వచ్చిన సంబంధాలన్నిట్నీ తిరగ్గొట్టేస్తోంటే యిప్పుడు అవికూడా రావడం మానేసాయి. అడపా తడపా ఏ దూరపు సంబంధమో రావడం తప్ప తెలిసినవారెవరూ అతన్ని వెతుక్కుంటూ రావడంలేదు.

ఇప్పుడిప్పుడు అతనికి భయంకూడా పట్టుకుంది.

ఈ ఏడాదికి యిలా యీ వెన్నెల వెలుగులూ, ఈ పూలగాలులూ వ్యర్థమైపోయినా వచ్చే యేడాదైనా వాటిని సార్థకం చేసుకోవాలి—అని ప్రతి సారీ అనుకుంటూనే వస్తున్నాడు. అలా అనుకోవడమే మిగులుతోంది. తొలి రోజుల్లో మల్లెపూలు కొనుక్కునేవాడు. వెన్నెల్లో తిరిగేవాడు. ఇప్పుడు అవన్నీ మానుకున్నాడు. అవి బాధను కలిగిస్తున్నాయి. భయపెడుతున్నాయి. అందు కని వాటి జోలికి వెళ్ళడమే మానేశాడు.

పదిరోజుల కిందట ఓ సంబంధం చూడ్డానికి వెళ్ళినప్పుడు, అమ్మాయిని గదిలోకి తీసుకొస్తుండగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ, అలా వేసిన ప్రతి అడుగు మీదా బరువునంతా వాల్చి సన్నని నడుమును మరీ పక్కకు వాల్చేస్తూ, అలలు అలలుగా చీర కుచ్చిళ్ళను ముందుకు నెట్టుకుని నడిచివస్తోన్న అమ్మా యిని చూసి, ఆ అమ్మాయి బుట్టలోలకుల్నీ, జడగంటలతో మరీ పొడుగుదేరిన జడనూ గుర్తించి, "ఈ అమ్మాయికి తప్పక డేన్సు వచ్చుంటుంది" అను కున్నాడు.

అతని చూపుల్ని కనిపెట్టి అతనికూడా వచ్చిన పినతండ్రి అడిగాడు: "అమ్మాయికి డేన్సు ఏమన్నా నేర్పించారేమిటి?" అని.

ఆ ప్రశ్నకు అమ్మాయితోసహా అంతా తెల్లబోయారు.

"డేన్సు నేర్పించలేదండి. ఏదో కాస్త సంగీతం మాత్రం వొచ్చు. పాడించమంటారా...." అన్నాడు అమ్మాయి తండ్రి.

"అక్కర్లేదులెండి" అనేశాడు అనంతమూర్తి. ఊరెళ్ళి యింట్లోవాళ్ళతో సంప్రదించి ఉత్తరం రాస్తామని బయలుదేరారు.

అప్పుడే వచ్చి వారం రోజులయ్యింది. కార్డుముక్కన్నా రాయలేదు. అవతలివాళ్ళు కంగారుపడుతూ ఉత్తరం కూడా రాశారు.

ఏం రాయించాలో అనంతమూర్తికి తోచకుండా వుంది.

—ఇదికూడా యిలానే అయ్యింది. ఇంత చిన్న కోరికకూడా తీరడం లేదు. ఇంత కాలంగా కోర్కెల మొలకలకు నిరీక్షణల నీళ్ళుపోసి పెంచు కుంటూ వస్తే, అవి ఏ కాయలనూ కాయలేని గొడ్రాలు చెట్లు అయిపోయాయి. పూసిన పూలు రాలిపోతున్నాయే తప్ప నిలవడంలేదు. ఎన్ని అమృతం కురిసిన రాత్రిళ్ళు తనకు కాకుండా పోయాయో! ఎన్ని గులాబీలు పరచుకున్న ప్రేమ నిండిన సాయంకాలాలు తనకు మిగలకుండా పోయాయో!! ప్రకృతిలో ప్రతి అణువునా నిక్షిప్తమైన అందం యిప్పుడు తనకు అందడంలేదు. మోడుబారి పోయిన మొక్కలా అయిపోతోంది జీవితం. ఇంత మబ్బుతునక మీద వంగినా, ఇన్ని చినుకులు పైన జారినా, కాస్తంత ఎండపొద తగిలినా ఏమీ అనిపించని చైతన్యరహితమైన యీ మోడు జీవితంలోంచి తనకిక విముక్తి వుండదా? చిటారుకొమ్మన మిగిలిన ఆకులా చెప్పా చెయ్యకుండా యీ యౌవనం రాలి పోవడానికి యింకెంత కాలం కావాలి!....

దిగులుతో అతని మనసు రెపరెపలాడింది.

ఆ మర్నాడు వాళ్ళ చిన్నాన్న అతన్ని అంతకుముందు చూసొచ్చిన సంబంధం గురించి అడిగితే, "మీ యిష్టం. మీకు నచ్చితే నాకు నచ్చినట్టే" అన్నాడు.

తొలిసారి పెళ్ళిచూపులకు వెళ్ళినప్పుడు బంగారు బొమ్మలాంటి అమ్మా యిని చూసి చేసుకోనంటే ఎంతగా ఆశ్చర్యపోయారో యిప్పుడూ అంతగానే ఆశ్చర్యపోయారు బంధువులూ, స్నేహితులూను. ఆలస్యమైతే మళ్ళీ ఏంబుద్ధి పుడుతుందో అని మాఘమాసంలో మొదటి లగ్నానికే పెళ్ళికూడా జరిపించేశారు.

దిగకేం చేస్తాడు. సాగనప్పుడు కొండమీది కోతికూడా దిగొస్తుంది— అనుకుని వ్యంగ్యంగా నవ్వుకుని, తగిన శాస్తి జరిగిందన్న తృప్తి చూపొకటి అతను కనిపించినప్పుడు విసిరిన బంధువులు ఓరోజు ముక్కుమీద వేలేసు కున్నారు.

కారణం—

డేన్సు టీచరు ఒకామెను రోజూ యింటికి రప్పించుకుని భార్యకు డేన్సు నేర్పిస్తున్నాడు అనంతమూర్తి.

మొదట్లో అందుకు మలయవతి—అతని భార్యే—ఒప్పుకోలేదు.

"చూడు మలయవతీ! ఆ బుట్టలోలకుల్ని తీసేయ్యకుండా అలానే వుంచేసుకుంటావు కదూ" అన్నాడు అనంతమూర్తి తొలిరోజున.

అలానే అన్నట్టు అనురాగపు కొనచూపులు విసిరీ, ఆనందపు చిరునవ్వులు వొదిలీ, నునుసిగ్గుతెరల మేలిముసుగును పైకి తీసుకుని మెల్లగా, లోలకులు సన్నగా పలకరించగా, అతి మనోహరంగా తలూపింది.

"జడకూడా అలానే వేసుకో, జడగంటలు అల్లుకున్న జడంటే నాకు చాలా యిష్టం" అన్నాడు.

మరీ పొడవైన చూపుతో అతని హృదయపు లోతుల్లోని అమృతాన్ని తోడితీసి, ఆ తెల్లని అమృతపు పాలనురుగుల కాంతుల్ని అతని కళ్ళల్లో నిలిపి, మత్తెక్కిన అతని కనుపాపల్ని ఊయలలూగిస్తూ, జడగంటల చిరుమువ్వలు తాళం వేయగా "అలానే" అన్నట్టు తలూపింది.

"నృత్యం అంటే చాలాయిష్టం నాకు; నీకూ యిష్టమేనా?" అన్నాడు ఆమెను హృదయంలో నిలుపుకుంటూ.

జల్లు జల్లుగా కురుస్తోన్న సిగ్గు తుంపర్లలో తడుస్తూ అతని హృదయపు నీడలోకి మరింతగా వొదిగి గుసగుసలు పలుకుతున్నంత మెల్లగా, సంగీతంతో సానబట్టిన కంఠంతో మనోహరంగా "ఊ" అంది.

"నిన్ను చూసినప్పుడు నర్తకివేమో అనుకున్నాను. నీ నడకలోని లయనూ, నీ చూపుల్లోని భావాల కదలికలో వేగాన్నీ, నీ ఆకారపు వొంపుల్లోని సొగసునూ చూసి నీకు డేన్సు వచ్చేమోనని అడిగించాను పెళ్ళిచూపులనాడు. నిన్ను నర్తకిగా చూడాలని మరీ ముచ్చటగా వుందినాకు. పోనీ నేర్పిస్తాను నేర్చుకుంటావా?"

ప్రియుని సందేశాన్ని మోసుకొచ్చిన గాలితెర గుసగుసలకు చిగురాకు పవిట పులకరించినట్టు ఆమె మనసు జల్లుమంది. భర్త పొగడ్తల గిలిగింతలకు తెరలు తెరలుగా చిరునవ్వు కెరటాలు హృదయంలోంచి కొట్టుకొచ్చి విడిచిన

తెల్లటి నురగల్ని కనిపించనీయకుండా పెదాలు బిగబట్టి, భర్త ముఖంలోకి విచిత్రంగా చూసింది మలయవతి.

"నేర్చుకుంటే నీకు చాలా త్వరగానే వచ్చేస్తుంది; అట్టే కష్టంకూడా కాదు." అన్నాడు అతను.

భర్త ఆలోచనల్లోనూ హృదయంలోనూ నీడలా, కాంతివెంట కిరణంలా, జ్వాలవెంట వేడిలా, పూవువెంట తావిలా కలిసిపోవడమే తప్ప విడివడడం మర్చిపోవలసిన తొలిరోజుల్లో భర్త కోరికను కాదని చెప్పలేని మూగమనసుతో గుండెమీంచి జారిపోయి పక్కకి జరిగి కూర్చుని భయపడుతూ, బిడియపడుతూ జాలిగా దీనంగా భర్త ముఖంలోకి చూస్తూ వుండిపోయింది.

"నిజం. నీ అందమూ, నీ లావణ్యమూ చక్కగా సరిపోతాయి. నీలాంటిది నర్తకి అయితే లాస్యాన్ని బాగా ప్రదర్శించగలదు." అన్నాడు తిరిగి.

తొలిరోజునే భర్త కోరికను మన్నించలేని అసహాయతలో చిక్కుకున్నందుకు కళ్ళల్లో నీరు చేరి, అతని రూపాన్ని మసగ్గా అలికేస్తోంటే, అతని మనసు కూడా తననుండి జారిపోతుందేమో నన్నంత భయంతో కళ్ళ రెప్పల్ని టపటపా కొట్టుకుని కన్నీళ్ళను ఒత్తుకుని "ఎలాగండీ! అసలు ఏమాత్రం నాకు చేతకాదుకదా. ఇప్పుడెలా నేర్చుకొనేదీ? ఈ వయసులోనా?" అంది. కళ్ళల్లో తడినైతే అద్దేసుకో గలిగిందిగాని, కంఠంలో దుఃఖాన్ని మాత్రం పక్కకు నెట్టేయలేకపోయింది.

"కళకు కావలసింది సాధనగాని వయసుతో సంబంధమేమిటి. నువ్వేం గొప్ప నర్తకివి కానక్కర్లేదు. స్టేజిమీద డేన్సు చేసేంత పరిపూర్ణంగా నేర్చుకోనక్కర్లేదు. నాగురించి ఏకాంతంగా డేన్సు చేస్తేచాలు. చిరకాలంగా నాకున్న కోరిక అది. ఇలాచూడు మలయవతీ! నాగురించి ఆ మాత్రం కష్టపడలేవూ!" జాలిగా, పేదవాడి ఆకలి కోరికలా అతి దీనంగా; తనను తాను తగ్గించుకుని, తన వ్యక్తిత్వాన్ని ప్రేయసి ముందు కర్పూరంలా మండించే ప్రేమ భక్తుడి ఆశ కళ్ళలాంటి కళ్ళతో ఎదుట నుంచున్న భర్త ముఖం చూసేసరికి నిలువునా

ఆమె నీరైపోయి అప్రయత్నంగానే తలూపేసింది. అలా వూపుతూ చటుక్కున ఆగిపోయి "ఏమండీ! నలుగురూ ఏమనుకుంటారోనండీ!" అంది.

"ఏమనుకుంటే మనకేం. మనిష్టం మనది. అయినా యింత పెద్ద వూళ్ళో మనల్ని గురించి పట్టించుకునేవాళ్ళే వుండరు" అన్నాడు. ఆమెను దగ్గరికి తీసుకుని ఆమె కళ్ళల్లో తన రూపాల్ని చూసుకున్నాడు.

నెలరోజుల తర్వాత డేన్సు టీచరు ఒకామెను ఏర్పాటు చేశాడు. సాయంకాలంపూట ఆమెవచ్చి, ఓ గంట సేపు చెప్పి వెళ్తుండేది. అనంతమూర్తి ఆఫీసునుంచి ఆరింటికి యింటికి వచ్చేవాడు. ఆపాటికే డేన్సు పాఠాలు అయిపోయేవి. మలయవతి స్నానంకూడా చేసేసి భర్తగురించి ఎదురుచూస్తూ కూర్చునేది.

ఆ ఇంట్లో వుంటున్నది వాళ్ళిద్దరే. కొత్త సంసారం కాస్త దారిన పడే వరకు వుందామని అతని తల్లి వచ్చి నెలరోజులుండి వెళ్ళింది. తండ్రి రిటైరయ్యాక కాకినాడలోనే యిల్లొకటి కట్టుకుని స్థిరపడిపోయాడు. చదువుకుంటున్న ఆడపిల్లలున్నారు. స్వగ్రామంలో పొలాలు ఉన్నాయి. కాకినాడ అనువుగా వుంటుందని అక్కడ స్థిరపడ్డాడు తండ్రి. అనంతమూర్తి ఉంటున్నది బెజవాడలో. రైల్వేలో వుద్యోగం. బంధువులు చాలామంది ఆ వూళ్ళో వున్నారు.

వాళ్ళందరూ అనంతమూర్తి భార్యకు డేన్సు నేర్పిస్తున్నాడని "అవ్వా" అని నోరు నొక్కుకున్నారు. అతను ఎదురైనప్పుడు పలకరించి, వ్యంగ్యంగా విసుర్లు విసిరేవారు. అతను వాటిని ఏమాత్రం లక్ష్యపెట్టేవాడు కాదు.

ఊరిలో ఏమూల నృత్య ప్రదర్శన జరిగినా భార్యను వెంటబెట్టుకుని వెళ్ళేవాడు. శాస్త్రీయ నృత్యాలుగల ఏ సినిమా వచ్చినా ఒకటికి రెండు సార్లయినా భార్యతోసహా వెళ్ళివస్తుండేవాడు. భారతీయ నృత్యరీతుల్ని గురించి, ముఖ్యంగా భరతనాట్యం, కూచిపూడి నృత్యాలను గురించి అతనికి బాగా తెలుసు. వాటిమీద వచ్చిన పుస్తకాలూ, పత్రికల్లో వ్యాసాలూ చదువుతుండేవాడు. తరచుగా ఆ విషయాలన్నీ భార్యకు తెలియజేస్తుండేవాడు. ఆమె

నిరుత్సాహంతో నీరుకారిపోకుండా ప్రతి పలుకులోనూ ఆమెను ప్రోత్సహిస్తూ మాట్లాడేవాడు.

భర్త శ్రద్ధ చూస్తే ఆమెకే ఆశ్చర్యం వేసేది. నేర్చుకుంటున్న తొలి రోజుల్లో ఆమెకు విసుగ్గా వుండేదికానీ కొద్దికొద్దిగా వంటబడుతున్నతర్వాత ఆమెకే ఆసక్తి కలిగింది. ఎవరూ లేనప్పుడు గదిలో నిలువుటద్దం ముందు కూర్చుని తన చూపుల్తో తనే ఆడుకునేది.

క్రమక్రమంగా ఆమె పాదాలలోకి ప్రవాహంలోని ఒరవడీ, గలగలలూ జారి వెనకటి ఆమె కదలికల్లోని హొయలతో కలిసి హంస నడకలోని విలాసాన్నీ, పావురం కదలికల్లోని ఠీవినీ, నెమలి అడుగుల్లోని నాజూకునూ నింపుకుంటున్నాయి. ఆమె చూపులు పదునుదేరి కళ్ళ కొసల్ని మృదువుగా కోసి విస్తరించి ఏ మారుమూల వెలుగు రేఖనైనా, ఏ దూరతీరాల్లోని మిణుగురు రేణువునైనా వెంటనే అందుకోగలిగే చురుకుదనాన్నీ, గ్రహణశక్తినీ అలవరచు కుంటున్నాయి. ఆమె శరీరం ఒకొక్కచోట కుంచించుకుని, మరొకచోట వికసించి, వొంపులు ప్రస్ఫుటమై, వెలుగునీడల్ని స్పష్టంగా విడదీయగలిగే కోణాల్ని నింపుకుని కంచు ప్రతిమల్లోని గట్టిదనాన్నీ, నునుపునూ ప్రకటిస్తు న్నాయి. రూపంలేని పొగమంచులా జారి, మాయలోంచి వాస్తవంలోకి దిగి ఆకారాల్ని ఏర్పరచుకున్న మంచు బిందువుల ముత్యాల్లా అతని జీవితం మీదకు వాలిన కలలు యధార్థమై అనుభవాల ముత్యాల సరాల్తో అతన్ని అలంక రిస్తున్నాయి.

అప్పుడప్పుడూ వెన్నెల వర్షాలు కురుస్తూనే వున్నాయి. అనేక రాత్రిళ్ళు వాళ్ళ డాబామీద ఆ వెన్నెల్లో తడిసి చలికి రక్షణగా వెచ్చని అనుభవాల దుప్పట్లు కప్పుకుని నిద్రపోయేవారు.

చాలాకాలం క్రితం, కాపరానికి వచ్చిన కొత్తలో, వాళ్ళ పెరడులో మలయవతి నాటిన మల్లెతుప్ప ఓ సాయంకాలం మసకచీకట్లో మూడు నక్షత్రా ల్లాంటి పూలు పూసింది. వాటిని అతను కొయ్యలేదుగానీ ఆ మర్నాటినుంచీ ఆఫీసు విడిచాక యింటికొచ్చేటప్పుడు రోజూ పావలా మల్లెపూలు కొనుక్కుని పట్టుకొచ్చేవాడు. డాబామీద పక్కలపై చల్లుకునేవారు. రాత్రల్లా ఆ పూల

పరిమళం వాళ్ళ చుట్టూ దోమతెరలా అల్లుకునేది. చంద్రుడు వున్న వెలుగు రాత్రిళ్ళు ఆ పూలు వెన్నెల వర్షంలో పడిన వడగళ్ళయ్యేవి. చంద్రుడు లేని చీకటి రాత్రిళ్ళు నక్షత్రాలయ్యేవి. రాత్రల్లా ఆ పూల చక్కిలి, మృదువైన గిలిగింతల స్పర్శ, చుట్టూ పరిమళం తెర, ఉదయం లేచేసరికి నిద్రలేని కళ్ళలా పక్కలమీద ఎర్రబడి కనిపించే పూలు, చూసేకొలదీ, సిగ్గుతో కందిన చెక్కిలి ఎరుపుతో నవ్వుతున్నట్టనిపించే ఆ పూల కొంటెతనం—ఆ పగలల్లా అతని ఆలోచనల్లో అవే.

జీవితం గుబురునిండా కోరికల మొగ్గలు. అవి యౌవనపు నిండుతో విరిసి, గాలిలో పరిమళాల తెరలు పరిచి, రంగురంగుల ముగ్గులు పెట్టి మర్నాడు తృప్తిగా రాలిపోయేవి. అవి రాలకముందే ఆ పక్కనే మంకొన్ని.

రోజూ ఉదయిస్తున్నాడు సూర్యుడు. వడగళ్ళతో హోరున వర్షిస్తోంది వెన్నెల. ఒక్కొక్కప్పుడు జల్లుజల్లుగా కురుస్తోంది. తుంపర్లు జారి పుప్పొడిలా సన్నసన్నగా రాలుతోంది. ఇంకొకప్పుడు పొగమంచులా అతని జీవితం చుట్టూ మత్తుగా అల్లుకుంటోంది.

మెల్లమెల్లగా మల్లెపూలు వెనకపడ్డాయి. కుంభవృష్టిగా వర్షం కురిసి వెలిసిపోయినా ఆకుల్ని అంటిపెట్టుకుని వొదల్లేక వొదల్లేక జారే నీటిచుక్కల్లా వెనకబడిపోతున్న మల్లెల పరిమళాల కొసర్లు ముక్కుపుటాల్ని పట్టుకొని వేలాడుతున్నాయి.

జీవితం రసమయంగా, శోభాయమానంగా, రాగభరితంగా అనిపిస్తోంది. కాలానికి పగ్గాలువేసి, తాపీగా కలల్ని నెమరేసుకుంటున్నారు.

నెలరోజులుగా రోజుకి పదిసార్లన్నా జ్ఞాపకం చేసుకుంటూ వచ్చిన పెళ్ళిరోజు చివరకు ఓరాత్రి చిక్కటి చీకట్లను చీల్చుకొని బైటపడింది. ఒక్కొక్క వెలుగురేఖనే విప్పుకుని నిండుగా వికసించాడు సూర్యుడు. అతను జార్చిన కాంతి పుప్పొడి లోకమంతా దట్టంగా పరచుకుంది.

ఆరోజు అనంతమూర్తి ఆఫీసుకి సెలవుపెట్టాడు. ఆ పగలల్లా ఆమెను తన కళ్ళల్లోనే ప్రతిష్ఠించుకున్నాడు. సాయంకాలం మిత్రులకు ఘనంగా పార్టీ

యిచ్చాడు. ఆ హడావిడి అంతా పూర్తయ్యేసరికి ఏడయ్యింది. తీరుబాటుగా కూర్చుని పెళ్ళినాటి ముచ్చట్లు నెమరేసుకుంటున్నారు.

అనంతమూర్తి చటుక్కున లేచివెళ్ళి పెట్టెలోంచి ఓ పెద్ద పార్సిలు పట్టుకొచ్చి ఆమె చేతిలో పెట్టాడు.

కళ్ళ రెప్పల్ని ఎగరేసి "ఏమిటి?" అన్నట్టు చూసింది.

"విప్పు, నీకే తెలుస్తుంది."

ఆమె విప్పింది. కళ్ళు జిగేల్‌మన్నాయి. మెరుస్తోన్న రంగు రాళ్ళతో ఆభరణాలూ, ఆ అడుగున ముదర రంగులో మధ్యమధ్య జరీ అల్లకం డిజైనులతో ఏవో బట్టలూ—ఆమె ఆశ్చర్యపోయింది. పెళ్ళిరోజు కానుకగా పొద్దున్నే సింధూరం రంగు గద్వాల్ చీర భర్త యిచ్చాడు. ఇప్పుడివన్నీ ఏమిటో ఆమెకు అర్థంకాలేదు. బట్టలు పైకితీసి మడతలు విప్పింది. అర్థమయ్యింది. డేన్సు డ్రెస్సు అది!

"అద్దెకు తెచ్చాను. ఇవ్వాళ నువ్వు యివన్నీ కట్టుకుని డేన్సు చెయ్యాలి. ఫోటోలు తీద్దామని రమణని అడిగి ఫ్లాష్ కెమెరా పట్టుకొచ్చాను" అన్నాడు అనంతమూర్తి.

"అప్పుడే ఏంవస్తుందండీ. కరణాల్ని కూర్చడం యిప్పుడిప్పుడే చేతనవుతోంది. ఏడాదికూడా కాలేదుకదా. ముద్రల్నయితే పట్టగలను కానీ వాటిని వరసగా కూర్చడం అంతగా రాదే."

"ఎలా వొస్తే అలా చెయ్యి, చాలు. అసలు ఆ డ్రెస్సులో ఎలా కదిలినా అందంగానే వుంటుంది."

అక్కడికీ ఆమె సందేహిస్తూ నుంచుండిపోయిందిగానీ అతను అతి జాలిగా, దీనంగా మరీమరీ అడిగేసరికి "అలాగేలెండి" అని చెప్పి లోపలకు వెళ్ళింది. పావుగంట తర్వాత తలుపులు తీసుకుని వచ్చి "ఎలావుంది ఈ డ్రెస్సు. నాకు నప్పిందా?" అని అడిగింది.

అతను మాట్లాడడంకూడా మర్చిపోయి కళ్ళార్పకుండా ఆమెనే చూస్తూ వుండిపోయాడు. ఇంతకు ముందెప్పుడూ కనీసం కల్పనలో కూడా చూడనంత

అందంగా కనిపిస్తోంది ఆమె. యౌవనాన్ని ఎక్కడికక్కడ బంధించేసిన బట్టల్లో మామూలుకన్నా పుష్టిగా, ఆరోగ్యంగా, అందంగా వుంది. ఆ గదిలో ఆమె చుట్టూ రేడియో, ఎలక్ట్రిక్ లైటువంటి ఆధునిక పరికరాలు కన్పిస్తు న్నాయిగాని లేకపోతే ఆమె కొన్ని తరాల క్రితంలో వున్నట్టు, ఈ ప్రజా స్వామ్యానికి ముందు ఏ రాచరికపు వ్యవస్థలోనో జీవిస్తున్నట్టు, కలకంటున్నట్టు అనిపించివుండేది అతనికి

"ఎక్సెలెంట్, బ్రహ్మాండంగా వుంది" అన్నాడు. ఆమెను దగ్గరికి తీసుకుని గట్టిగా కావలించుకున్నాడు. ఆమె భుజానికి తగిలించుకున్న దండ కడియంలో రాతిపోడి రాలినచోట యిత్తడిరేకు గుచ్చుకోగా ఆమెను ఒదిలేసి చిన్నగా నవ్వుతూ "తెలివితక్కువగా ప్రవర్తిస్తున్నానుకదూ, ఇంతకాలానికి నా కోరిక తీరింది. నన్ను నేనే మర్చిపోయాను. ఏదీ చక్కటి ఫోజు యివ్వు, ఫోటో తీస్తాను" అన్నాడు.

ఆమె మెల్లగా కదిలివెళ్ళి అతని ఎదుట మూడు గజాల దూరంలో నిలుచుని శరీరాన్ని ఓ పక్కగా తిప్పి, ఎడమ కాలును కొద్దిగా వంచి, శరీరం బరువునంతా దానిమీదుగా పాదంమీద నిలిపి, కుడికాలును కూడా అదే రీతిలో అట్టే బరువును ఆన్చకుండా తేలిగ్గా చేర్చి, రెండు చేతుల్నీ నేలకు సమాంత రంగా చాచి, అలా చాచిన కుడిచేతిని రొమ్ముల ఎదుటికి మడిచి, రెండు చేతుల్తోనూ త్రిపతాక ముద్రలు పట్టింది. అతను ఏంగిల్ సరిచూసుకుని ఫోటో తీశాడు.

శిల్పంలా నిల్చున్న ఆమె ఆ భంగిమలోంచి కదిలి లయానుగుణంగా, కాలప్రమాణంతో ఆయా స్థితులకు గల హస్తముద్రలు పడుతూ పాద విన్యా సాట్ని చూపుతూ నమస్కరించింది.

ఆ తర్వాత సన్నగా పాడుతూ, పాటకు తగిన అభినయంచేస్తూ ఒక స్థితినుండి మరొక స్థితికి చటుక్కున కదులుతూ, దానికి అనుగుణంగా కరణాలను కలుపుకుని, అంగహారాలను అల్లుకుని, ఒక్కొక్క అంశాన్నీ అతనిముందు వుంచింది.

అతను మరికొన్ని ఫోటోలు తీశాడు.

ఆమె వచ్చి అతని పక్కనే కూర్చుని "సరిగ్గా రాలేదుకదండీ. తాళం ఎవరైనా వేసి పాడుతూ వుంటే బావుండేది" అంది. కళ్ళు ఎగరేసి పక్కవాటుగా చూపుల్ని జార్చి "ఎలావుందండీ. చెప్పరూ" అంది తిరిగి కుతూహలంగా.

"ఇంకా కొత్తకదా, మరో రెండేళ్ళు యిలాగే నేర్చుకుంటే బాగానే రావొచ్చు; అభినయం చక్కగానే కుదిరింది గానీ తీర్మానాల్లో తాళకట్టు దెబ్బతింటోంది మరి. ఆటలో యింకా నాజూకు వొచ్చి చేరాలి. మరికొంత కాలంపోతే అదే వొస్తుందనుకో. అసలు ఏడాదిలో ఈ మాత్రం నేర్చుకోవడమే గొప్పకదా. ఎలాగైతేనేం నా కోరిక తీర్చావు" అన్నాడు ఆమెను హృదయానికి హత్తుకుంటూ. అలసిపోయిందేమో రొమ్ములు ఎగిరిపడుతున్నాయి. ఆమె విడుస్తోన్న నిశ్వాసాలు మెడమీద గిలిగింతలు పెడుతున్నాయి. "నా పంతం నెరవేరడానికి నిన్ను యిబ్బంది పెడుతున్నాను కదూ" అన్నాడు తిరిగి ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

కదిలి; విరిసి, విప్పారి, వాల్పడిన కనురెప్పల కిందనుంచి చూస్తూ "ఉహూఁ" అంది ఆమె. అతని కళ్ళల్లో వాలుతోన్న మత్తుపొరల్ని గుర్తించి, నవ్వుకుని, మెల్లగా ఒడిలోంచి జారి లోపలకు వెళ్ళిపోయింది.

ఆ రాత్రి వాళ్ళు డాబామీద వెన్నెలలేని చీకట్లో, యీ ఏడాదిగా జరిగిన విశేషాలన్నీ ఒక్కొక్కటే మననం చేసుకుంటూ బాగా పొద్దుపోయే వరకూ కూర్చుండిపోయారు.

మూడు రోజుల తర్వాత ఫోటో ప్రింటులు పట్టుకొచ్చాడు అనంతమూర్తి. మరీ బాగా వచ్చిన ఫోటోకు ఫ్రేముకూడా వేయించాడు. ఫోటోలో తనని తాను చూసుకుని మురిసిపోయిందామె. "ఇంకా బాగా కృషిచేసి నేర్చుకోవాలి" అనుకుంది.

ఇప్పుడు ఆమెకు అడుగడుగునా నాట్యమే కనిపిస్తోంది. వంట చేసేప్పుడు స్టౌలోంచి ఎగసిన జ్వాలల్లోనూ, తడిపి ఆరేసిన దండెంమీది చీర కదిలికలోనూ, దేవుడిముందు వెలిగించిన అగరువత్తి పొగ మెలికల్లోనూ, చెయిజారి ఒలికిన నీళ్ళు పల్లానికి జారిన చాలులోనూ—ప్రతిచోటా నాట్య

రూపాలే కనిపిస్తున్నాయి. ప్రతి వస్తువు కదలికలోనూ కొత్తదనం కనిపిస్తోంది. చూపుకి కొత్త కోణాలు ఏర్పడ్డాయి. ఇంతకు పూర్వం జీవితం ఒక నాటకం అనుకునేది. ఇప్పుడు అదొక "బాలే"గా అనిపిస్తోంది.

ఆమె ఉత్సాహానికి ఆదిలోనే హంసపాదు తగిలింది. తండ్రికి రక్తపోటు వస్తే సాధ్యమైనంత త్వరగా తిరిగి వచ్చేద్దామని వెళ్ళింది. అనంతమూర్తికి వీలుగాక ఒక్కర్తినే పంపించాడు. వారం రోజుల్లో తగ్గింది కాని, ఎలాగూ సంక్రాంతి రానేవస్తోందికదా. అల్లుడు వస్తే ఏకంగా వాళ్ళిద్దరూ కలిసే వెళ్ళిపోవచ్చునని ఆపేశారు ఆమెను.

పండక్కి అతను వెళ్ళాడు. కొత్తల్లుడికి పెట్టుపోతలవీ బాగానే జరిపారు. ఉన్న ఐదు రోజులూ బాగానే గడిచిపోయింది. ఇల్లు కదిలి బయటికే వెళ్ళలేదు. ఒకరోజు సాయంకాలం మాత్రం యిద్దరూ కలిసి సినిమాకు వెళ్ళారు.

బయలుదేరి వచ్చేస్తూ బంధువులకు చెప్పడానికి వెళ్ళినప్పుడు యించుమించు అంతా ఒకేవిధంగా దీవించారు—ఆర్నెల్లు తిరక్కుండానే పుట్టింటికి నిండుగా రావాలి సుమా—అని. ఆమాటే ఆమె స్నేహితురాలు చూడ్డానికి వచ్చి అంది. అప్పుడు మలయవతి "ఆ....ఏం పిల్లలో పోనిస్తూ, మరో అయిదేళ్ళవరకూ పిల్లలు కలక్కపోతేనే మంచిది" అంది.

ఆ మాటల్ని వాళ్ళ నాయనమ్మ ఆలకించినట్టుంది. "ఓహో! మీ ఆయన నిన్ను కోతినిచేసి ఆడిస్తున్నాడుకదే, అందుకా యీ ఆలోచన" అని దెప్పిపొడిచింది. ఆ మాటలు అనంతమూర్తికి వినిపించాయి.

బాధపడ్డాడు.

రైల్లో "నిన్ను కోతినిచేసి ఆడిస్తున్నానా?" అని అడిగాడు అనంతమూర్తి.

బయలుదేరిన దగ్గర్నుంచీ భర్త ముభావంగా ఎందుకున్నాడో ఆమెకు అర్థమయ్యింది. "ఇందుకా మీరిలా మూతి ముడుచుక్కూచున్నారు. భలేవారే" అని నవ్వేసింది. ఆయన మూడ్‌ని మార్చుదామని ఏమిటేమిటో చెప్తోంది. ఆమెకు రైలు ప్రయాణమంటే ఇష్టమట. చిన్నప్పుడు ఎక్స్‌కర్షన్లకు వెళ్ళినప్పుడు

కిటికీ పక్కసీటు గురించి తరచు పోట్లాడుకునేవారట. ఇలా ఏమిటేమిటో చెప్తోంది.

ఆమె చెప్తున్నప్పుడు ఆమె చూపులు జ్ఞాపకాల్లోకిజారి, పసిపాప చూపుల్లోని కుతూహలంతో కదిలి, యౌవనంలోని ఠీవితో నిలకడగా కొద్దిసేపు నిలుచుండిపోతున్నాయి. బాల్యంలోని కొంటెతనంతో గెంతి, అలసటేలేని ఉత్సాహంతో కుతూహలం ఎక్కువైనప్పుడు కళ్ళ రెప్పలు టపటపా కొట్టుకుని, అంతలోకే చటుక్కున ఆగి, సిగ్గుతో ముడుచుకుపోయి, కొద్దికొద్దిగా తెరచుకుని చూపుల్ని దాగుడుమూత లాడిస్తున్నాయి. మధ్యమధ్య వాలుగా, కళ్ళ కొసలలోంచి విలాసంగా చూసి, అతని ఆలోచనల్ని తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది ఆమె.

ఆమె పన్నిన చూపుల ఉచ్చులో చిక్కుకుపోయి శ్రద్ధగా ఆలకిస్తోన్న అనంతమూర్తి మధ్యలో ఎందుకో తలెత్తి అటు చూశాడు. అవతల కూర్చున్న వ్యక్తి తమవైపే చూస్తున్నాడు. అనంతమూర్తి ఇటు చూశాడు. ఈ పక్క కూర్చున్న వ్యక్తీ అలానే చూస్తున్నాడు. ఎదుటుకి చూశాడు. ఆ ఎదుటి వ్యక్తీ అంతే. మూడు వైపులా చూశాడు. అందరి కళ్ళూ యిటేవున్నాయి. అనంతమూర్తి చూడ్డం చూసి, తప్పుచేసినట్టు చూపులు తిప్పేసుకుంటున్నారు వారు!

ఆమె చెప్పడమైతే మెల్లగానే చెప్తోందికానీ ఆ కళ్ళను తిప్పడంవల్లే అందరి చూపులూ యిటు వాలుతున్నాయి. అలా కళ్ళతో మాట్లాడడం ఆమెకు కొత్తేమీకాదు. చాలా సరదాగా కూడా వుండేది అతనికి.

ఇంట్లోనయితే బావుండును కాని యిక్కడేమిటి ?—అతనికి సిగ్గుగా వుంది. ఆమె మాత్రం అదేమీ గుర్తించినట్టులేదు. రాజమండ్రి ఎక్స్‌కర్షన్ అనుభవాలూ, అక్కడ చూసిన విశేషాలూ చెప్తోంది.

ఆమె ఆపేటట్టులేదని మధ్యలో అతను అందుకుని ఆ మధ్య అస్సాంలో జరిగిన రైలు ప్రమాదాన్ని గురించి చెప్పడం ప్రారంభించాడు.

ఆమె కళ్ళను యింతింత చేసుకుని చక్రాల్లా గుండ్రంగా తిప్పి మధ్యలో కనుపాపల్ని ఆశ్చర్యంగా, కళ్ళను ఆర్పి వెలిగిస్తూ బితుకు బితుకుగా, భృకుటి ముడిచి కనురెప్పల్ని కొద్దిగా వాల్చి; చూపుల్ని పగ్గాలతో వెనక్కులాగి

బిగించి పట్టుకుని, ప్రశ్నార్థకంగా, పైకెత్తి పట్టుకున్న చోటినించి దబ్బున జారిపడి కుప్పగా నిస్త్రాణగా వాలిన చూపుల్తో జాలిగా చూస్తూ; మధ్యమధ్య కళ్ళతో పలకరిస్తూ, ఆడుగుతూ, అవునంటూ వింటోంది. చూపులతోపాటు తలనూ కదుపుతోంది. పెదాలనుకూడా ముడుస్తూ, కొసమెలికలు తిప్పి, ధనుస్సులా నిలిపి, సంధించినట్టు లాగి, అభినయపూర్వకంగా తలూపుతోంది.

మధ్యమధ్య రహస్యంగా అతను చుట్టూ చూస్తున్నాడు. అందరి చూపులూ—యిటే వున్నాయి. ఏదో మాట్లాడుకుంటున్నట్టున్నా, వాళ్ళ చూపుల్లో కుతూహలం వుంది; దొంగతనం వుంది; చిరునవ్వు వుంది.

అనంతమూర్తికి అదోలావుంది. మలయవతి ఈ కళ్ళ కదలికల్ని కట్టిపెడితే బాగుండును అనుకుంటున్నాడు. నలుగురూ చూస్తున్నారన్న ఆలోచనైనా లేదేమిటి?—అతనికి చిరాకుకూడా కలిగింది.

ప్రయాణం పొడవునా అతను అలాంటి యిబ్బందిని ఎదుర్కొంటూనే వున్నాడు. బైటికే చెప్పేద్దామనుకున్నాడుగాని మళ్ళీ ఆమె బాధపడుతుందేమో అని ఏమీ అనలేదు. భరిస్తూనే కూర్చున్నాడు బెజవాడలో దిగిపోతున్నప్పుడు తమచుట్టూ కూర్చున్న జనం తమనే చూస్తున్నట్టనిపించింది అతనికి. స్టేషను దాటి బైటికొచ్చి తేలిగ్గా ఊపిరి తీశాడు.

వెళ్ళినరోజు బడలికగా వుండి డేన్సు టీచరును పిలిపించలేదు. మర్నాడు కబురంపిస్తే మళ్ళీ మామూలుగా రావడం ప్రారంభించింది ఆమె. చురుగ్గా పాఠాలు సాగుతున్నాయి.

ఒకరోజు అనంతమూర్తికి తలనొప్పిగావుంటే ఓ గంట ముందుగా యింటికి బయలుదేరాడు. రెండు రోజులుగా రొంపచేసింది; తగ్గలేదు. ఒళ్ళంతా బరువుగావుంది. మధ్యాహ్నంనించి తలనొప్పిగా వుండి ఇంటికెళ్ళి ఏ అమృతాంజనమో రాసుకుని, టీ తాగి, కాస్సేపు నడుం వాల్చుదామని బయలు దేరాడు. రిక్షా సగందూరం వచ్చాక టైము చూసుకుంటే అప్పుడే డేన్సు పాఠం పూర్తి కాదుకదా అనిపించింది. బైట ఏ హోటల్లోనైనా టీ తాగి వెళ్దామని గవర్నరుపేట సెంటరు దగ్గర రిక్షాను ఆపించి దిగిపోయాడు. నాలుగడుగు లైనా వేసాడోలేదో ఎదురుగ్గా పరాంకుశంగారు కనిపించారు. పినతండ్రి

కొడుక్కి పిల్లనిచ్చిన మావగారు ఆయన. మంచి హోదాలో వుండి రిటైరయిన వ్యక్తి. ఆయనంటే అందరికీ గౌరవమే. సాయంకాలంపూట బారేజివరకూ షికారుకు వెళ్ళడం అలవాటు. "రావోయ్! అలా వెళ్దొద్దాం" అని పిలిచా రాయన. పిలిస్తే తప్పించుకోలేకపోయాడు. అక్కడికీ "మధ్యాహ్నంనించీ తల నొప్పి వస్తోందండి; ఆఫీసులో కూర్చోలేక యింటికి బయలుదేరాను" అన్నాడుగాని ఆయన "చల్లగాలి తగిలితే అదే తగ్గిపోతుందిలేవోయ్" అని తేలిగ్గా తీసిపారేశారు.

గంటన్నరసేపు ఆయనతో గడపాల్సి వచ్చింది అనంతమూర్తికి. టీ అయినా పుచ్చుకోలేదు. తలనొప్పి మరీ ఎక్కువగా వుంది. ఒళ్ళు బాగా నొప్పులు పెట్టాయి. నడుం లాగేస్తోంది. ఆఫీసునించి తిన్నగా యింటికెళ్ళ కుండా యిలా రావడం బుద్ధితక్కువ అనిపించింది. ఇంటికెళ్తే ఈ బాధలన్నీ లేకపోనుకదా అనుకున్నాడు. వెళ్ళకపోవడానికి కారణం భార్యే అని ఆమె మీదా, దార్లో కనిపించి యివతలివారి కష్టసుఖాలైనా ఆలోచించకుండా కూడా వెంటబెట్టుకుపోయిన గౌరవంవున్న ఆ పెద్దమనిషిమీదా కోపంవచ్చి లోలోపలే చిరాకుపడ్డాడు. విసుక్కున్నాడు. ఆయన్ని అలా వెళ్ళనిచ్చి రిక్షాలో కూలబడి యిల్లు చేరుకున్నాడు.

"ఆలస్యమయిందేం?" అంది మలయవతి ఎదురొచ్చి.

"ఏమీలేదు" అని చెప్పి లోపలకు వెళ్ళిపోయాడు.

భర్త ముఖంలోని అలసటను, చిరాకును గుర్తించి అతని వెనకనే గదిలోకి వచ్చింది. బట్టలయినా మార్చకుండా మంచంమీద సాగిలబడుతున్న భర్తనుచూసి ఆశ్చర్యంగానూ, గాభరాగానూ "ఏమిటండీ, మీ ఒంట్లో బాగా లేదా" అంది. నొసలు తాకిచూసింది. మంచులా చల్లగా తాకిన ఆమె చేతిని తొలగిస్తూ కళ్ళు విప్పకుండానే "మరేంలేదు. తలనొప్పిగా వుంది. టీ వుంటే పట్టుకురా" అన్నాడు.

గ్లాసుతో టీ తెచ్చి యిచ్చింది. అమృతాంజన్ తెచ్చి కణతలకి రాస్తూ కూచుంది. ఆమె ఆదుర్దాను చూస్తే అనవసరంగా ఆమెను కంగారు పెడు

తున్నానే అనిపించింది అతనికి. లేచి బట్టలు మార్చుకుని కూచుందామా అనుకున్నాడు.

"వొంట్లో బాగోకపోతే సెలవుపెట్టి వెంటనే యింటికి వచ్చేయలేక పోయారా? యింతసేపూ బయట ఎందుకు తిరుగుతున్నారూ," అంది ఆమె మందలింపుగా.

అతనేమీ మాట్లాడలేదు. విపరీతమైన కోపం వచ్చింది. ఒకసారి కళ్ళు తెరిచిచూసి మళ్ళీ మూసుకున్నాడు. రాత్రికి భోజనం చెయ్యలేదు. ఆమె బలవంతంచేస్తే పాలు మాత్రం తీసుకున్నాడు.

పొద్దుటికి బాగా జ్వరం వచ్చింది. వొళ్ళంతా నొప్పులు. కదిలే ఓపిక లేదు. నడుమంతా విపరీతంగా లాగేస్తోంది. దానికితోడు తలనొప్పి. మలయవతి కంగారుపడి డాక్టరును పిలిపించింది. "ఫ్లూ తగిలింది. మరేం కంగారు పడనక్కరలే"దని చెప్పి, మందిచ్చి వెళ్ళాడు డాక్టరు. ఆరోజు డేన్సు టీచరు వస్తే రెండు రోజులపాటు రావొద్దని చెప్పి పంపించేసింది మలయవతి.

మర్నాటికి తలనొప్పి కాస్త తగ్గింది. వొళ్ళు నొప్పులు యింకా తగ్గ లేదు. గబగబా వంట పూర్తిచేసుకుని వొచ్చికూర్చుంది. "నిన్న భలే భయం వేసింది లెండి. ఒంటరిదాన్ని. ఇంటికి టెలిగ్రాం యిద్దామనుకున్నాను. డాక్టరు వచ్చి ఫ్లూ అనేవరకూ మనసు మనసులోలేదు" అంది.

అనంతమూర్తి ఆమె ముఖంలోకి చూడలేక చూపులు మార్చుకున్నాడు. కొద్దిసేపయ్యాక యిటు తిరిగిచూస్తే—

"నూటమూడు డిగ్రీల జ్వరం అనేసరికి మతిపోయింది. దానికితోడు జ్వర తీవ్రతతో మీరు మూలుగుతోంటే మరీ భయపడిపోయాను" అంది.

అతను గట్టిగా కళ్ళుమూసుకుని అవతలి వైపుకు వత్తిగిల్లాడు.

"ఏమిటి! మళ్ళీ తలనొప్పి వస్తోందా? వుండండి. అమృతాంజనం రాసుకుందురుగాని" అని గబగబా వెళ్ళబోయింది.

"వొద్దు అక్కర్లేదు." అన్నాడు గట్టిగా.

ఆ మాటల్లోని తీక్షణతకు ఆమె తెల్లబోయి చూస్తోంటే అతను తననితనే సమాధానపరచుకుని "కాస్త టీ కలిపి పట్టుకురా మలయవతీ! యివ్వాళ ఆకలి ఎక్కువగా వుంది" అన్నాడు.

అర్ధగంట క్రితం బత్తాయిపండు వలిచేదా అని అడిగితే "వొద్దు, ఆకలిగాలేదు" అన్న భర్త యిప్పుడు ఆకలేస్తోంది అంటే ఆశ్చర్యం వేసింది ఆమెకు. "ఈ టీలు తాగితే ఆకలేం తీరుతుంది. రెండు బత్తాయిలు తినండి" అంటూ గబగబా ఓ బత్తాయి పండు ఒలిచింది. "కాస్సేపు లేచి కూర్చున్నాడు. ఆమె ఒక్కొక్క తొనే యిస్తోంటే తిన్నాడు. కడుపు నిండుగా వుంది యికచాలు అని అంటున్నా వినిపించుకోకుండా మరో బత్తాయికూడా వొలిచేసింది. "ఒక పండుతోనే ఆకలేం తీరిపోయిందండీ, యిదిగో యిటు చూడండీ....యిలా చూసి చెప్పండి. నిజంగా ఆకలి తీరిందా....అబద్ధం. మరీ చిన్నపిల్లవాళ్ళు అయిపోతున్నారు మీరు. తీసుకోండి....పోనీ యీ నాలుగు తొనలూ...."

ఆ చూపులు, ఆ కదలికలు, ఆ కళ్ళల్లో విలాసం, ఆకర్షణ, గిలిగింతలు, దాగుడుమూతలు; ఆ ముఖంలో అభినయం అతనికి చాలా చికాగ్గా అనిపించాయి. 'ఉద్రేకాన్ని రెచ్చగొడుతున్నట్టు ఏమిటా తళుకుబెళుకులు? ఎందుకీ సంరంభం? మామూలుగా ఎందుకు ప్రవర్తించదూ?'—అనుకున్నాడు.

ఆమె చేతిలోంచి చివాల్న ఆ నాలుగు తొనలూ లాక్కుని కసిగా నమిలి, తొక్కల్తోనే మింగేసి, "నాకు నిద్రొస్తోంది. పడుకుంటాను. నువ్వెళ్ళి నీ పని చూసుకో"—అని చెప్పి ముసుగు లాక్కున్నాడు.

ఆమెకు ఏమిటో అర్థంకాక తెల్లబోయి లేచి వెళ్ళిపోయింది.

మర్నాటికి జ్వరం పూర్తిగా తగ్గింది. పత్యం పుచ్చుకున్నాడు కాని ఆఫీసుకు వెళ్ళలేదు. ఆరోజుకూడా యిల్లాంటి సంఘటనలే ఎదురుపడినప్పుడు సహనం అవధులుదాటిపోయి, "అలా కళ్ళుతిప్పి మాట్లాడకపోతే మామూలుగా మాట్లాడలేవూ" అన్నాడు. ఆమె ముఖం మాడ్చుకుంది. ఆ ఉక్రోషంతోనే ఆరోజు డేన్సు పాఠాలుకూడా చెప్పించుకుంది. నిజానికి ఆ వేళకూడా సెలవు తీసుకుందామని అనుకుందిగాని పంతంవొచ్చి ఆరోజు పాఠాలు చెప్పించుకుంది.

అతను ఎవరినీ ఏమీ అనలేక తనను తానే కసురుకున్నాడు. తనమీద తనకే కోపం వచ్చింది. ఒకరోజుపాటు వాళ్ళు ఎడముఖం పెడముఖంగానే మసిలారు. మర్నాడు మళ్ళీ మామూలుగా మెసలక తప్పలేదు. ఇంట్లో మూడో వ్యక్తి వుంటే ఎన్ని పంతాలకు పోయినా సాగేవి. దానికితోడు తను అలా ప్రవర్తించడం అర్థంలేనిదిగా అనిపించింది అతనికి. భార్యను అనవసరంగా కసురుకున్నందుకు సిగ్గుపడ్డాడు కూడాను. "ఏదో పిచ్చి తాళికి అంటే అలా బాధపడతావేం ?" అన్నాడు ఆమెను దగ్గరికి తీసుకుని. ఆమె తీగలా అతన్ని అల్లుకుపోయింది.

శ్రీరామనవమికి ఊళ్ళో పందిళ్ళు వేసి నాటకాలవీ వేస్తున్నారు. వాళ్ళ వీధితోకూడా పందిరి వేశారు. ఆయన దగ్గర చందాకూడా తీసుకెళ్ళారు. నాలుగోరోజున భరతనాట్యం ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ఆరోజున అనంత మూర్తి భార్యను వెంటబెట్టుకుని వెళ్ళాడు. భరతనాట్యం చేసే అమ్మాయిలు యిద్దరే. ఆ యిద్దరికీ ఎనిమిదీ, పదేళ్ళకన్నా మించి వుండవు. చిన్నపిల్లలైనా చక్కగా చేశారు.

ఇంటి కెళ్ళాక "ఎలావుంది ?" అని అడిగాడు అనంతమూర్తి.

"చాలా చక్కగా వుంది. చిన్నప్పుడు ఏ అయిదో ఏటనుంచో నేర్చు కోవడం ప్రారంభించి వుంటారు" అంది ఆమె. "మరి మీకెలా అనిపించింది?"— అన్నట్టు అతనివైపు చూసింది.

"కదిలికలు బాగున్నాయిగాని ముఖంలో సరైన ఎక్స్‌ప్రెషన్ లేదు" అన్నాడు.

"చిన్న పిల్లలకి అదెలా వొస్తుందండీ వయసు వచ్చేకొలదీ పరిపూర్ణత వొస్తుందిగాని, నవ్వుతూ నవ్వుతూ చటుక్కున వెనక్కు తీసేసుకోవడం, జారి పోతున్నట్టుగాక బిగించిపట్టుకుని పగ్గాలను ఒదులుతున్నట్టు చూపుల్ని ఒదలడం, ముఖ భంగిమల్లో కృత్రిమంగానే అయినా వాస్తవికతను కనబర చడం—యివన్నీ వయసుతో వచ్చే విద్యలుగాని పుట్టుకతో వచ్చేవికావు."

"మీరికూడా బాగానేవచ్చే" అన్నాడు నవ్వుతూ.

మంచులోని మొగ్గలా, కన్నెపిల్ల మనసులా సిగ్గుతో ముడుచుకుపోయిన కళ్ళలోంచి జారీజారని చూపుల్తో చూసి, చిరునవ్వు ఒలికీ ఒలకనట్టు పెదాల్ని కదిపింది.

అతని మనసు చటుక్కున ఆలోచనల్లోకి ఎగిరింది. ఇంతకుముందే ఆమె అన్న మాటల్ని మననం చేసుకుంటున్నాడు.

ఆమె ఏమిటో అడిగినట్టుంది. పలక్కపోతే అతన్ని కదిపి "ఏమిటండీ ఆలోచిస్తున్నారు?" అంది.

"అబ్బే ఏంలేదు" అన్నాడు అతను.

"భలేవారే! పరధ్యాన్నం కూడా వస్తోందేమీకు. పక్కలు డాబామీద పరిచేదా, యింట్లోనా అంటే ఏమీ లేదంటారేమిటీ" అంది నవ్వుతూ.

"అవును .... అవును ... అదే చిరునవ్వు. అదే అదే" అనుకున్నాడు అతను ఆ ఎదుటి గోడమీద షులయవతి నాట్య భంగిమ ఫోటోలోకి చూస్తూ.

ఆమెకు ఏమీ అర్థంకాలేదు. "ఏమోబాబూ, నాకు నిద్రొస్తోంది. నేను గదిలోనే పడుకుంటాను" అని ఆమె వెళ్ళిపోయింది.

ఆ రాత్రి చాలా సేపటివరకూ అతనికి నిద్రపట్టలేదు.

మర్నాడు ఆఫీసుకు వెళ్తున్నప్పుడు "సాయంకాలం త్వరగా వస్తారు కదూ, మర్చిపోకండి. మీతో పనుంది" అంది వాలుగా చూసి.

"అలాగేలే" అని ముఖం చిట్లించుకుని వెళ్ళిపోయాడు. మనసును ఎంతగా సమాధాన పరచుకుందామన్నా వీలు కావడంలేదు అతనికి. ఆ మధ్య దేన్ను చేసిననాడూ యిలాగే చూసింది. ఇలాగే కళ్ళతోనే పలకరించింది. ఆ రెప్పల్ని వాల్చడమూ, ఆ చూపుల్ని జార్చడమూ, ఆ పెదాల్ని మెలికలు తిప్పడమూ—అన్నీ అలానే వున్నాయి. కృత్రిమంగానే వాస్తవికతను ప్రదర్శిస్తోందా?—అతని మనసు మబ్బు పట్టినట్టు అయిపోయింది.

సాయంకాలం కావాలనే వేగంగా యింటికి వెళ్ళలేదు. రాత్రి బాగా పొద్దుపోయేక వెళ్ళాడు. ఆమెకు ఏదో వంక చెప్పాడు.

"నేనూ అదే అనుకున్నానులెండి, ఏ స్నేహితుడో తగిలుంటాడని. ఎనిమిది కావస్తోంది, భోజనం వడ్డించెయ్యమంటారా?"

ఆమె ముఖంలోకి పట్టిపట్టి చూశాడు. ఎక్కడా బాధపడుతున్న ఛాయలే లేవు. మరీ మరీ ఆమె చెప్పినప్పుడు ఆమెను నిరుత్సాహ పరచాలనే అలస్యం చేశాడు. కాని ఆ ధోరణే కనిపించలేదు. ఆమె బాధపడకుండా వుంటుందని అనుకోలేక పోతున్నాడు. అంతకు ముందు ఎప్పుడైనా ఏ ప్రోగ్రామైనా వేసుకున్న రోజున ఆలస్యంగావస్తే మూతి ముడుచుకునేది. ఆమెను ప్రసన్నం చేసుకోవడానికి అర్ధగంటైనా పడుతుండేది. ఇప్పుడిది—ఇది నటనకాక మరేమిటి?

"ఇవ్వాళ్ళ మీకు యిష్టమైన కొత్తిమిరి పచ్చడి చేశాను. బట్టలు మార్చుకునివస్తే వడ్డించేస్తాను. కాస్సేపు డాబామీద కూర్చుందాం. ఇవ్వాళ వెన్నెల కూడా వుంది." అర్థవంతంగా, ఆనందాన్ని కళ్ళల్లో దాగుడుమూతలాడిస్తూ, పెదాల వెనక చిరునవ్వును దాచుకుని, చూసింది.

అతను కళ్ళార్పకుండా ఆమెనే సూటిగా చూస్తోంటే సిగ్గుతో ముడుచుకుపోయి, ముసిముసిగా నవ్వుకుంటూ "అబ్బ! ఏమిటండీ అలా చూస్తారు. మీరు అలా చూస్తుంటే మీ ముందుకే రానుబాబూ" అంది.

"ఆ మధ్య డేన్సు చేసినప్పుడు కూడా నువ్వు యిలానే రెప్పల్ని కదిపి, కంటిపాపల్ని ఆడించావుకదూ! అచ్చం యిలానే నవ్వావుకదూ!" అని ఆమె కళ్ళల్లోకి సూటిగా చూశాడు.

"ఏమోబాబూ, నాకు అవన్నీ జ్ఞాపకంలేవు. చూసిన వాళ్ళకు మీకే తెలియాలి" అంది అని, కళ్ళ కొసల్లోంచి వాలుగా చూసింది.

"చూశానుగనకే అంటున్నాను. ఆ కళ్ళ కులుకులు, ఆ పెదాల వొంపులు అచ్చం ఆ భరతనాట్యంలోలాగే వున్నాయి."

భర్త మాటల్లో ఆ పదునేమిటో ఆమెకు అర్థంకాలేదు.

"సరేగాని మీరు వేగంగా తెమిలిరండి, వడ్డించేస్తున్నాను." అని చెప్పి లోపలకు వెళ్తున్నదల్లా చటుక్కున మనసులో మెదిలిన ఆలోచనకి ఆగిపోయింది. వెనక్కు తిరిగి భర్త ముఖంలోకి విచిత్రంగా చూసింది. ఆమె కళ్ళల్లో వెలుగులు ఆరిపోయాయి. ఆమె పెదాలమీద చిరునవ్వు విరిగిపోయింది.

ఆమె ముఖంలో సంతోషం భగ్గున మండిపోయింది. ఆమె చూపులు పిచ్చిగా ఉన్నాయి ఆమె పెదాలు వణికిపోతున్నాయి. ఆమె ముఖం పాలిపోయింది.

"ఇప్పుడర్థమయ్యింది. ఇదంతా నటన అనికదూ మీరనేది. ఈ అభిప్రాయం ఇలాంటి విచిత్రమైన ఆలోచన మీకెలా కలిగింది? మిమ్మల్ని మోసగిస్తున్నానన్న అభిప్రాయం మీరెలా ఏర్పరచుకున్నారు? ఇంతకన్నా పెద్ద అభాండం మరోటి వుండదు....ఎందుకిలా శిక్షిస్తారు నన్ను." ఆమె కళ్ళల్లో కన్నీరు కదిలింది. ఆమె కంఠం బొంగురు పోయింది.

అతనేమీ మాట్లాడలేదు. బట్టలు మార్చుకుని డాబా మీదకు వెళ్ళిపోయాడు. ఆమె దుఃఖాన్ని ఆపుకోలేక మంచంమీద వాలిపోయి వెక్కి-వెక్కి ఏడ్చేసింది.

గంట తర్వాత అతను డాబాదిగి నిద్రపోదామని గదిలోకివస్తే టేబిల్ మీద భోజనం వడ్డించివుంది. ఆమె ముసుగుపెట్టి నిద్రపోతోంది. అతను భోజనం చెయ్యలేదు.

ఒకరి నొకరు పలకరించుకోకుండా నాలుగు రోజులు గడిచిపోయాయి. ముఖం కడుక్కుని వచ్చేసరికి కాఫీ, టిఫిను గదిలో పెట్టివుండేది. తొమ్మిదిన్నర అయ్యేసరికి అతను వంటగదిలోకి వెళ్తే భోజనం వడ్డించి వుండేది. మరీ యిబ్బందికరమైన పరిస్థితుల్లో ఆమె పొడిపొడిగా దగ్గేది. అతను అటు చూసేవాడు. ఆ టైమునుబట్టి ఆమె స్నానానికి నీళ్ళు తోడిందనో, భోజనం వడ్డించిందనో తెలుసుకునేవాడు.

ఓరోజు మధ్యాహ్నం కేంటీనుకు వెళ్ళినప్పుడు జేబులోంచి డబ్బులు తియ్యబోతే చిన్న చీటీ బైటికి వచ్చింది. "డేన్సు టీచరును మాన్పించి వారం రోజులైంది. ఆమెకు జీతం యివ్వాలి. చీరా, రవికలగుడ్డా పెట్టాలి. ఎనభై రూపాయలు అవసరమౌతాయి. రేపు వస్తుంది ఆమె" అని వుంది.

మాన్పించేసిందంటే అతనికి బాధేమీ కలగలేదు. ఆమె మానేస్తేనే బావుండునన్న ఆలోచన కొంతకాలంగా అతని మనసులో మెదులుతోంది. ఇటీవల జీవితంనిండా అసహనం పేరుకుపోయింది. రోజురోజుకి యిద్దరిమధ్యా

ఎడం ఎక్కువైపోతోంది. దీన్ని ఎలా దాటడం? కోరిక తీరిందన్న సంతోషం కూడా లేకుండా పోతోందికదా! అలాంటప్పుడు ఎందుకిది?

సాయంకాలం యింటికొచ్చినప్పుడు మధ్యాహ్నం ఎస్.బి. లోంచి తీసిన ఎనభై రూపాయలూ అలమారాలో పై రేక్‌లో ఆమెకు కనిపించేటట్టుగా పెడుతుండగా అక్కడ అతనికి కొత్తగా కొన్ని మందుసీసాలూ, ఇంజక్షను బుడ్లూ కనిపించాయి. అతను ఆశ్చర్యంగా అవతలి గదిలోకి చూశాడు. అక్కడ అటు తిరిగి రేడియో వింటూ ఏమిటో అల్లుకుంటోంది మలయవతి. పరిశీలనగా చూశాడు. ఆమె చేతిలో పూర్తి అవుతూ అవుతూ వున్న బుల్లి మేజోడు!

అతను మెల్లగా కదలివెళ్ళి, ఎప్పుడో ఆమె చేతిలోంచి జారిపడి దొర్లుకుంటూ చాలా దూరం వచ్చేసిన ఊలు వుండను తీసి, దారం చుట్టుకుంటూ చుట్టుకుంటూ చుట్టుకుంటూ ఆమె దగ్గరకు చేరుకున్నాడు.

(1967)

★